## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 19-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

-  రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.
-  రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈరోజు కీలక అంశాలకు ఆమోదం లభించింది.
-  కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మూడు పారిశ్రామిక క్లస్టర్లను ప్రతిపాదించిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
-  ఆసియాకప్ లో భాగంగా భారత్ ఒమన్ జట్ల మధ్య టి-20 క్రికెట్ మ్యాచ్ ఈరోజు రాత్రి 8 గంటలకు ప్రారంభంకానుంది.

===================

రాష్ట్రంలో రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో నీటి సమర్ధ నిర్వహణ అంశంపై అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. పంట నష్టం జరిగిన రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకున్నామన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల ఎకరాలకు నీటిని అందిస్తున్నామని చెప్పారు. దేశంలో నదుల అనుసంధానాన్ని చేపట్టిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని పేర్కొన్నారు.

===================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అసెంబ్లీ ప్రాంగణంలో ఈరోజు మంత్రివర్గ సమావేశం జరిగింది. 15 అంశాలు ఏజెండాగా మంత్రివర్గం సమావేశమయ్యింది. అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న సుమారు 13 బిల్లుల అంశాలకు సమావేశంలో ఆమోదం లభించింది. అమరావతి పరిధిలో 343 ఎకరాల భూ సేకరణకు సంబంధించి గతంలో ఇచ్చిన నోటిఫికేషన్ ఉపసంహరణకు మంత్రివర్గం అమోదం తెలిపింది. అలాగే.. నాలా ఫీజు రద్దుకు సంబంధించి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌లోని వివిధ చట్టాలను సవరిస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

===================

కొబ్బరి ద్వారా విలువ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 3 పారిశ్రామిక క్లస్టర్లను ప్రతిపాదించిందని ఎం.ఎస్.ఎం.ఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఈరోజు శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. యంఎస్ఈ-సిడిపి పథకం కింద రాజోలు నియోజకవర్గం పెదపట్నంలంకలో 9.96 కోట్ల రూపాయల వ్యయంతో కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. ఈ నియోజకవర్గంలో కొబ్బరి సాగు 25 వేల ఎకరాలలో ఉందని, సాలుకు 30 నుంచి 40 కోట్ల కొబ్బరికాయలు ఉత్పత్తి అవుతాయని అన్నారు. స్థానికంగా విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుతో కొబ్బరి రైతులకు మేలు జరుగుతుందని మంత్రి తెలియజేశారు.

===================

అన్ని వర్గాల ప్రజలకు అవసరమయ్యే ఔషధాలను తక్కువ ధరలకు అందించాలనే ఉద్దేశంతో జీఎస్టీ ని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించడం పట్ల శ్రీకాకుళం జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చారిత్రక నిర్ణయం.. రోగాల బారిన పడిన

పేదలకు పెద్ద ఉపశమనం కలిగిస్తుందని పలువురు చెబుతున్నారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ఇనుముల పద్మావతి ఈ అంశంపై మాట్లాడుతూ.. క్యాన్సర్ తో సహా అరుదైన వ్యాధులకు సంబంధించిన 33 రకాల ప్రాణరక్షణ మందులపై పన్నును పూర్తిగా తొలగించడం శుభపరిణామమన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి.. జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో ఎంతో మేలు జరుగుతుందని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ బైట్...22 సెకన్లు)

===================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం తీసుకున్న వివిధ చర్యలపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ బైట్...90 సెకన్లు)

===================

ట్-20 ఆసియాకప్ క్రికెట్ లో భాగంగా భారత జట్టు ఒమన్‌తో ఈరోజు రాత్రి జరగనున్న మ్యాచ్ లో అబూదాబి లో తలపడనుంది. ఇప్పటివరకు అజేయంగా దూసుకెళుతున్న టీమిండియా ఈ మ్యాచ్‌ను సూపర్-4కు సన్నాహకంగా ఉపయోగించుకోవాలని భావిస్తోంది. టాప్ ఆర్డర్ విశేషంగా రాణించడంతో ఇప్పటిదాకా మిడిల్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లకు పెద్దగా అవకాశం దక్కలేదు. ఆడిన రెండు మ్యాచ్‌లు కూడా ఏకపక్షంగానే ముగిశాయి.

===================

పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శ్రీకాకుళం లోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ ను ఈరోజు సందర్శించారు. పాఠశాల ఆవరణలో ఎంపీ లాడ్స్ నిధులతో నిర్మాణంలో ఉన్న తిలక్ హాల్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన.. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆదేశించారు. పాఠశాలను దత్తత తీసుకుంటున్నానని కేంద్రమంత్రి ఈ సందర్భంగా ప్రకటించారు.

(వాయిస్ బైట్...32 సెకన్లు)

===================

దక్షిణ కోస్తాంధ్రా, రాయలసీమ, కర్ణాటక మీదుగా దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు సగటు సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఒక ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఫలితంగా రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. పలుచోట్ల గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు.

===================

===================